క్లుప్తంగా

పేద మహిళలకు చీరల పంపిణీ



పేద మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న దృశ్యం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పేద మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత శివనారాయణ వాసిరెడ్డి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి కె. వీరయ్య, సహాయ కార్యదర్శి ఎం శ్రీనివాస్‌రావు, పి. నాగేశ్వర్‌రావు, రాజమౌళి, హస్మిత, సంగీత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజస్వామి కీర్తనలు తెలుగు భాషా సంపద



నాట్యగురువు జీ.వాసును సన్మానిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, కళాజనార్థనమూర్తిలు

చిక్కడపల్లి: త్యాగరాజ స్వామి కీర్తనలు తెలుగు భాషాసంపద అని తె లంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. గురువారం త్యాగరాయ గానసభ కళాసుబ్బారావు కళావేదికలో త్యాగరాయ ఆరాధన ఉత్సవాలలో భాగంగా నాట్య గురువు జీ.వాసుశిష్య బృందం కూచిపూడి శైలిలో త్యాగరాజ కీర్తనలకు అద్భుతంగా నర్తించారు. ముఖ్యఅతిథిగా ఉప్పలశ్రీనివాస్ పాల్గొని కళాకారులను సత్కారించారు.

శ్రీ మేధా హై స్కూల్‌లో ఆకట్టుకున్న రంగోలి



పాఠశాల ఆవరణలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

నల్లకుంట: నల్లకుంటలోని శ్రీ మేధా హై స్కూల్‌లో గురువారం రంగోలి(ముగ్గుల పోటీలు), స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు ఆకర్షణీయంగా ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. అలాగే సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్న విద్యార్థినులు, గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల వేషధారణలతో సందడి చేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం. రంగాచార్యులు, అగ్రికల్చర్ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం. సునీత హాజరయ్యారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులను ప్రభుత్వం గుర్తించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 60వేలకు పైగా ఉన్న ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులను ప్రభుత్వం గుర్తించి, ప్రత్యేక శిక్షణతో గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ కమ్యూనిటీ పారామెడికల్ వైద్యుల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. పారామెడికల్ వైద్యుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఐక్యవేదిక అధ్యక్షులు అశోక్ అధ్యక్షతన గురువారం సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, ఉపాధ్యక్షులు సదానంద్, కార్యవర్గ సభ్యులు సాయన్న, భాస్కర్, శ్రీనివాస్, నాగర్జున , లింగం తదితరులు పాల్గొన్నారు.

మహిళతో అసభ్య ప్రవర్తన.. 15 రోజుల జైలు



నిందితులు నారాయణ, చేతన్ కుమార్

ముషీరాబాద్: నడిరోడ్డుపై మద్యం తాగుతూ అటుగా వెళ్తున్న ఇద్దరి మహిళలపట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరికి కోర్టు 15 రోజుల జైలు శిక్ష విధించింది. ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్ యాదవ్ తెలిపిన మేరకు.. జనవరి 10వ తేదీ రాత్రి 9గంటలకు గాంధీనగర్‌లో నడిరోడ్డుమీద మందుబాటిల్స్ పెట్టుకొని మద్యం తాగుతూ అటువైపుగా వెళ్తున్న మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న మౌలాలికి చెందిన ఆటో డ్రైవర్ జి. నారాయణ, రాంనగర్‌కు చెందిన చేతన్ కుమార్‌లను ముషీరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారికి బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా 273గా తేలింది. పోలీసులు వారిపై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ మహేందర్ 15 రోజుల జైలు శిక్ష విధించారు.

ఒకే పని.. రెండు శంకుస్థాపనలు..

- ముందు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే..
- ఆ తరువాత మరోచోట శంకుస్థాపన చేసిన కార్పొరేటర్



డ్రైనేజీ లేన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్



మరోచోట డ్రైనేజీ లేన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజవర్గం గాంధీనగర్ డివిజన్‌లో రాజకీయం రంజుగా మారింది. బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా తయారైంది. మేమే పనులు మంజూరు చేయించాం.. నిధులు కేటాయింపచేశాం. అని బీజేపీ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ (గాంధీనగర్) చెప్పుకోగా.. ఈ పనులు మేమే మంజూరు చేయించాం..కాదంటే దేనికైనా సిద్ధం అని ఆమె భర్త వినయ్‌కుమార్ దేనికి సిద్ధం అని ఎమ్మెల్యే ముఠా గోపాల్‌నుద్దేశించి పేర్కొన్నారు.

◆ మాధవరావు లేన్‌లో గురువారం ఉదయం రూ.59 లక్షల అంచనా వ్యయంతో డ్రైనేజీ లేన్ ఏర్పాటు పనుల ప్రారంభ కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ కార్యక్రమానికి హాజరై పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతుండగా.. ఈ డ్రైనేజీలైన్ ఏర్పాటుకు కార్పొరేటర్ కృషి చేశారటకదా..మీరు శంకుస్థాపన ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారని విలేకరులు ప్రశ్నించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ..ఆయనకు ఏ పనులు ఎలా చేయించాలో తెలియదు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పీఏ సంతకం పెడితే పనులు అయిపోతాయి అనుకుంటున్నారు.. ఆలా కాదు మేము సీఎం వద్దకు వెళతాం.. కేంద్రమంత్రి వద్దకు వెళతాం.. పనులు చేయించుకుంటాం.. కార్పొరేటర్ ఏమీ చేయలేదు. వాటర్‌బోర్డు కార్యాలయానికి వెళ్లి.. తెలుసుకోవడం మేమే చేయించాము. అని చెప్పుకోవడం మాత్రమే చేస్తున్నారన్నారు.

భయంతోనే ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు...

◆ ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆరు నెలలనుంచి మాధవరావు లేనులో డ్రైనేజీ పైప్ లైన్ పనుల కోసం పదిసార్లు వాటర్ బోర్డ్ ఎండీ కార్యాలయానికి తిరిగాం.. కాలనీవాసులను కూడా తీసుకువెళ్లి ఎండీని కలిశాం. ఆయన స్పందించి వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించడంతో పనులు ప్రారంభమవుతున్నాయి. శుక్రవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హాజరౌతారని చెప్పాం.. పనులకు శంకుస్థాపన చేద్దామని ఎమ్మెల్యేకు సమాచారం అందించాం. అయితే కేంద్రమంత్రి వస్తే స్థానిక ప్రజలు సమస్యలు చెప్పుకుంటారు. పేరు కేంద్రమంత్రికి, కార్పొరేటర్‌కు వస్తుంది. బీజేపీకి ఆ పేరు పోకూడదనే భయంతోనే ఎమ్మెల్యే ఈ రోజు ఉదయం ఆఘమేఘాల మీద శంకుస్థాపన చేసినట్లు భావిస్తున్నాం. ఎమ్మెల్యే ఈ పనుల కోసం వాటర్‌బోర్డ్ ఎండీ వద్దకు వెళ్ళి ఉంటే ఆయనతో కలసిన ఒక్క సీసీ పుటేజీ అయినా బయటపెట్టాలన్నారు. కేంద్రమంత్రి వస్తారని చెప్పినా ప్రోటోకాల్ పాటించకుండా ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే వెళ్ళిపోయిన అరగంట అనంతరం కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ వచ్చి మరోచోట శంకుస్థాపన చేశారు. ఇప్పట్నునుంచి డివిజన్‌లో మా కార్యక్రమాలకు ఎమ్మెల్యేను అసలే ఆహ్వానించబోమన్నారు.

'దేశంలో మతతత్వ పాలన కొనసాగుతోంది'



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం : దేశంలో మతతత్వ పాలన కొనసాగుతోందని ప్రొఫెసర్ హరగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ హక్కుల ప్రకారం ప్రజాస్వామ్య పాలన అవసరం ఎంతైనా ఉందని అందుకు ప్రజలను చైతన్యం చేయాలని అన్నారు. గురువారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో నవ తెలంగాణ చైతన్య సమితి (ఎన్‌టీసీఎస్) ఆవిర్భావ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని నవతెలంగాణ చైతన్య సమితి లోగో, జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ..రాష్ట్రంలోని గ్రామ గ్రామానా ప్రజలను చైతన్యం చేసి ఓటు ద్వారానే మంచినాయకుడిని ఎన్నుకునేలా కృషిచేయాలన్నారు. మద్యం మానుకో.. ఓటు విలువ తెలుసుకో... అనే నినాదంతో ప్రజల వద్దకు వెళ్లాలని సూచించారు. సాంఘిక రాజకీయ హక్కులతో కూడిన సమానత్వం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నవతెలంగాణ చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నర్సయ్య, ఉపాధ్యక్షులు షెక్‌హబీబా, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాజేష్, కార్యదర్శి బాసా వరలక్ష్మి, కోశాధికారి తుప్పుడు అంజమ్మ, రాష్ట్ర నాయకులు ఆంజనేయులు, సునిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు కృషి



విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న పాఠశాల చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

అంబర్‌పేట : విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేందుకు ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ పాఠశాల చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులకు విద్యార్థి దశలోని శాస్త్ర సాంకేతిక అంశాలపై ఆలోచన ధోరణి ఉండేలా దృష్టి సారించాలన్నారు. గురువారం డీడీ కాలనీలోని విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన సందర్శించి విద్యార్థులను ఆవిష్కరణలను ఆయన పరిశీలించారు. విద్యార్థులు ఆవిష్కరించిన అంశాల పనితీరును అడిగి తెలుసుకుని అభినందించారు. పాఠశాల డైరెక్టర్ రూపారెడ్డి, ప్రిన్సిపల్ గీతాంజలి, వైస్ ప్రిన్సిపల్ సులక్షణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్కులను ఆధునీకరిస్తాం



బర్కత్‌పురా హౌసింగ్‌బోర్డు కాలనీ పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నియోజకవర్గంలో ఉన్న పార్కులను ప్రత్యేక బడ్జెట్‌తో ఆధునీకరించి అహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు చొరవ తీసుకుంటామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గురువారం కాచిగూడ డివిజన్‌లోని హౌసింగ్‌బోర్డు కాలనీ అంజయ్య పార్కులో రూ. 60 లక్షల హెచ్ఎండీఏ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్షించారు. పార్కులో కావాల్సిన ఆధునిక ఏర్పాట్లను రాజీలేకుండా ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

చేగువేర కూతురు,మనవరాలు సభను విజయవంతం చేయాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఈ నెల 22న రాష్ట్రంలో పర్యటిస్తున్న విప్లవయోధుడు చేగువేర కూతరు డాక్టర్ అలైదాగువేరా, మనవరాలు ప్రొఫెసర్ ఎస్టీఫీనా గువేరాల సభను విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి యువజన సంఘాలు పిలుపునిచ్చాయి. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో పీవైఎల్‌రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్ ప్రదీప్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ నెల 22న మధ్యాహ్నం 3గంటల నుంచి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సదస్సు జరుగుతున్నట్లు తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాద కుట్రలకు వ్యతిరేకంగా పోరాడుతున్న క్యూబాప్రజలకు మద్దతుగా ప్రపంచ శాంతిని కాపాడాలనే ఉద్దేశ్యంతో సభ జరుగుతుందని వారు చెప్పారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

నిందితులు తండ్రి, ఇద్దరు కుమారులు

అంబర్‌పేట: ఓ రౌడీషీటర్ ఓ కుటుంబాన్ని విచ్చిన్నం చేశాడు. జరిగిన అన్యాయాన్ని ఓ పెద్ద మనికిషికి చెప్పుకుందామని వెళ్తే రౌడీ షీటర్ గమనించి రెచ్చి పోయాడు. తన ఇద్దరు కుమారులతో కలిసి బాధితుడి అన్నను కొట్టి చప్పారు. అనంతరం పోలీసులకు కుమారులతో సహా పట్టుబడి కటకటాల పాలయ్యారు. ఈ సంఘటన అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. డీఐ ప్రభాకర్ కథనం ప్రకారం.. గోల్నాక సుందర్‌నగర్‌కు చెందిన పవన్‌రాజుకు తులసీనగర్‌కు చెందిన రౌడీషీటర్ శ్యామ్‌రాజ్ పరిచయం అయ్యాడు. ఈ పరిచయంతో పవన్‌రాజ్ భార్యతో సన్నిహితంగా మెలుగుతూ దగ్గరయ్యాడు. ఇది గమనించిన పవన్‌రాజు భార్యతో గొడవపడడంతో ఇద్దరు విడివిడిగా ఉంటున్నారు. పవన్‌రాజ్ అన్న సునిల్‌రాజు రౌడీషీటర్ శ్యామ్‌రాజ్ చేసిన అన్యాయన్ని ఈ నెల 6న తులసినగర్‌లో ఉన్న ఎమ్మెల్యే అనుచరుడు అనిల్‌తో చెప్పేందుకు తమ్ముడు, మరో స్నేహితుడు నర్సింగ్‌తో కలిసి వెళ్లాడు. ఇది గమనించిన శ్యామ్‌రాజ్ నా పైనే చెబుతావా అంటూ దాడికి దిగాడు. అక్కడే శ్యామ్‌రాజ్ కుమారులు పృథ్వీరాజ్(25), విశ్వరాజ్(21)లు సైతం దాడికి దిగారు. ఈ దాడిలో పవన్‌రాజ్, నర్సింగ్‌లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. సునిల్‌రాజ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 9న మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు హత్య కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. తండ్రి రౌడీషీటర్ శ్యామ్‌రాజ్‌తో పాటు ఇద్దరు కుమారులను పోలీసులు రిమాండ్ చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

చిక్కడపల్లి: చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో డ్రంక్ అండ్ కేసులో ఇద్దరు వ్యక్తులకు జైలుశిక్ష జరిమానా విధించారని చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ ధరావత్ నానునాయక్ తెలిపారు. గురువారం మాట్లాడుతూ మరో 34 మందికి జరిమానా, ఒకరి డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆరు నెలలు సస్పెన్షన్ చేస్తూ నాంపల్లి 4 ఎంఎం కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారని అన్నారు. మొత్తం 37 మందిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి జైలుశిక్ష, జరిమానా విధించారన్నారు. సికింద్రాబాద్‌కు చెందిన ఆంథోని రెండోసారి పట్టుబడ్డంతో నాలుగు రోజుల జైలుశిక్ష, 3,300 జరిమానా, అశోక్‌నగర్‌కు చెందిన పి.రాజుకు రెండు రోజుల జైలుశిక్ష, 2,100 జరిమానా, కొత్త గూడెంకు చెందిన ఎం వెంకటేష్, డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆరునెలలు సస్పెండ్ చేయడంతో పాటు 2,100 జరిమానా విధించినట్లు సీఐ వివరించారు. మిగతా 34 మందికి 2,100చొప్పున జరిమానా విధించారన్నారు.

చెట్టు నరికిన వారిపై చర్యలు తీసుకోండి

చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్ త్యాగరాయగానసభ సమీపంలో చెట్టను నరికేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెలవప్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ పోలీసులకు విజ్ఞప్తి చేసింది. గురువారం కౌన్సిల్ నాయకులు పోలీసులను కలసి ఒక వినతిపత్రం అందజేశారు.

14 నుంచి మల్లన్న జాతర

కవాడిగూడ: భోలక్‌పూర్ బాకారంలో ప్రసిద్ధిగాంచిన శ్రీభ్రమరాంభ మల్లికార్జునస్వామి (మల్లన్న) జాతర మహోత్సవాలు ఈ నెల 14 నుంచి 16 వరకు నిర్వహిసున్నామని ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నల్లవెల్లి ఊర్మిళా అంజిరెడ్డి తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో గురువారం మల్లన్నజాతర మహోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.

20 తులాల బంగారు ఆభరణాలు చోరీ

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 20 తులాల బంగారు నగలు చోరీ అయ్యాయి. డీఐ పిడమర్తి నరేష్ తెలిపిన మేరకు.. జవహర్‌నగర్‌లో నివసించే సరళారెడ్డి మంగళవారం అంబర్‌పేట్‌లోని బంధువుల ఇంటికి వెళ్ళారు. గురువారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన ఆమె ఇంటితలుపు తాళాలు తీసి లోనికి వెళ్ళారు. ఏదో పనిమీద బీరువా తెరిచిన ఆమెకు అందులో ఉండాల్సిన 20 తులాల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేసిన తాళాలు వేసినట్లే అండగా బంగారు ఆభరణాలు చోరీ ఎలా అయ్యాయో అర్థం కావడంలేదంటూ బాధితురాలు పేర్కొన్నట్లు వివరించారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



గోల్నాకలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్‌లు

అంబర్‌పేట: స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం అంబర్‌పేట నియోజకవర్గంలో ఆయా ప్రాంతాల్లో స్వామి వివేకానంద చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన స్ఫూర్తిని కొనియాడారు. డీడీకాలనీలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావు, కార్పొరేటర్ పద్మ వెంకట్‌రెడ్డి, గద్వాల జిల్లా ఇన్‌ఛార్జ్ వెంకట్‌రెడ్డిలతో పాటు స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు. అలాగే గోల్నాకలోని డీ మార్ట్ చౌరస్తాలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద జరిగిన జయంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్‌లు హాజరయ్యారు. స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ గోల్నాకలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వద్ద జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే కాచిగూడలోని కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.



వివేనంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్



స్వామి వివేకానందుడి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సి. కృష్ణా యాదవ్

నల్లకుంట: వివేకానందుడి జీవితం స్ఫూర్తిదాయకమని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సి.కృష్ణాయాదవ్ అన్నారు. గురువారం పాత నల్లకుంటలో గల స్ఫూర్తి భవన్‌లో స్వామి వివేకానంద 160వ జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సి.కృష్ణ యాదవ్ నల్లకుంట, బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్లు వై. అమృత, బి.పద్మా వెంకట్ రెడ్డి, బీజేపీ జోగులాంబ గద్వాల జిల్లా ఇంఛార్జి బి. వెంకట్ రెడ్డిలతో కలిసి అక్కడ ఏర్పాటు చేసిన వివేకానందుడి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక యువకులను శాలువాతో సన్మానించి వివేకానందుడి జీవిత చరిత్ర పుస్తకాలను అందజేసి మాట్లాడారు.

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో స్వామి వివేకానందా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జన్మదినాన్ని పురస్కరించుకోని ప్రధాన కూడళ్లలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు.

కవాడిగూడ: స్వామి వివేకానంద బోధనలు నేటి యువతకు మార్గదర్శకమని పలు పార్టీల నేతలు పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని గురువారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న విగ్రహం వద్ద వేడుకలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ వివేక్‌వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే మర్రిశశిధర్‌రెడ్డి, యువమోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి శ్యాంరాజ్, నగర అధ్యక్షుడు శ్యాంసుందర్, యువమోర్చా నగర అధ్యక్షుడు మద్దూరి శివాజీ, రామా కృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద హాజరై స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



గోల్నాకలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద ..



డీడీ కాలనీలో..

సంక్రాంతి సందడి

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో గురువారం సంక్రాంతి వేడుకలు సందడిగా జరిగాయి. పాఠశాలలు, కాలనీల్లో రంగోలి పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు.



సంక్రాంతి ముగ్గును ఆసక్తిగా తిలకిస్తున్న సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు.



రెడ్‌కాన్వెంట్ హైస్కూల్‌లో..



.అడిక్‌మెట్‌లో డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో..



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, డాక్టర్ విజయలక్ష్మి



రిషి పాఠశాలలో సంక్రాంతి వేడుకలు నిర్వహించుకుంట్టున్న విద్యార్థులు



సంప్రదాయ దుస్తుల్లో సంక్రాంతి సంబురాల్లో పాల్గొన్న ఏంజెల్స్ ప్రీ స్కూల్ చిన్నారులు



హైమావతి పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు



ముగ్గులు వేస్తున్న ఏంజెల్స్ ప్రీ స్కూల్ చిన్నారులు

కాకతీయ హైస్కూల్‌లో..

